# ప్రార్థన
# 3

## ప్రార్థన కానిది ...

ప్రార్థన "లోపల" ఉన్నది. ఇది బహుగా అందరి అభిమానం పొందింది. మతం "లోపల" ఉన్నది. మత సంబంధమైన పుస్తకపు కొట్లు సంవత్సరానికి కోట్లకొలది రూపాయల వ్యాపారం చేస్తున్నాయి. మనో భావనలు "లోపల" ఉన్నాయి. అర్థం కానిది "లోపల" ఉన్నది. అనుభూతి "లోపల" ఉన్నది. ప్రార్థన సెమినార్లు, రిట్రీటులు పెడుతూ ఉంటారు. ప్రార్థనా – ఉదయపు భోజనాలు అందరి అభిమానం పొందుతాయి. ప్రార్థన క్రుసేడులలో వేలకొలది మంది హాజరౌతారు. సువార్త ఉపదేశకులు "ప్రార్థనా యోధులను" నియమిస్తారు. "ప్రార్థనలో నీవు ఏది కోరితే అది పొందవచ్చు"ననే తలంపును నేడు జనులు ఎక్కువగా నినాదాలు చేస్తున్నారు. ఇది వినోదంకంటె ఎక్కువ కలవరంగానే ఉంది. ఈ మత సంబంధమైన తీవ్రతయందు మనం ఆనందించవలెనా? అవసరం లేదు.

దేవుడు ప్రసాదిస్తాడు ... అపవాది కేవలం నకిలీలనే యిస్తాడని గుర్తుంచుకో. మతస్థులు దేవుని గూర్చి మాట్లాడతారు, అయితే బైబిలు దేవుని గూర్చి కాదు. నేడు అనేకులకు మూఢ నమ్మకమైన విశ్వాసముంది, కాని బైబిలు విశ్వాసం కాదు. మనుష్యులు ప్రార్థనను లాభం కొరకు వినియోగించుకుంటారు కాని బైబిలు సంబంధమైన ప్రార్థన కాదు. పలు యథార్థమైన సమస్యలు చర్చించబడాలి.

ప్రార్థన గారడీ కాదు. అందులో రహస్యమైన శక్తులు ఏవీలేవు. ప్రార్థన అడ్డు దారి కాదు. ప్రార్థన యొక్క ఆధిక్యతను దుర్వినియోగం చేయకూడదు. అన్నిటిలో, ప్రార్థన సాతాను సంబంధమైనదిగా తగ్గింపకూడదు. ప్రార్థన స్వార్థపరత్వం కాని, మూర్ఖత్వం కాని కాదు. ప్రార్థనను సంపదతో ముడివేయడం అపాయకరం! ప్రార్థననుండి ఐశ్వర్యాన్ని కోరడం అత్యాశ ఔతుంది. దేవుని ఏదో "పనికి పంపే బాలుడుగా" ఆలోచన చేయడం మత భేదం. ప్రార్థనను "ఎలా యింకొకటిగా" చేయాలి అనేదానికి తగ్గించడం మతిహీనత.

పని మాంద్యానికి లేక పని నుండి "తప్పించుకొనడానికి" చేసేది ప్రార్థన కాదు. "త్రోవ తప్పిన" వాని వద్దకు వెళ్లి అతనితో మాట్లాడేకంటె, ప్రార్థన చేయడం సులభం. విశ్వాసము – ప్రార్థన "యేసునకు అప్పగించు" అనేది కాదు. ఆలోచనకు బదులు నిలిచేది ప్రార్థన కాదు. పనికి బదులు నిలిచేది ప్రార్థన కాదు. ప్రార్థించడానికి సమయముంది! ప్రార్థన మాని పని చేసే సమయం కూడా ఉంది! ప్రార్థనా రిట్రీటుకు పోయే అనేక మంది, దాని విషయమై ఏదీ చేయకుండగనే, మంచి భావాలతో తిరిగి వస్తారు. ప్రార్థన దోష

భరితమగు మనస్సాక్షికి ఎన్నడూ లోబడదు. దేవుడు మాత్రమే చేసే పనులు ఉంటాయి. సరళమైన విశ్వాస్యత స్థానాన్ని క్రొత్త పోకడల మతం ఆక్రమించుకోలేదు.

ప్రార్థన మనలను మంచిగా ఫీలయ్యేలా చేయకపోవచ్చు. "ప్రార్థనలో ఉన్నత అనుభవాలలో మనను ముంచి" సాక్షమిచ్చే కోట్లకొలది పుస్తకాలున్నాయి. ఇది పుస్తకాలను అమ్మించవచ్చు, కాని అది బైబిలు ప్రకారమయ్యింది కాదు. బైబిల్లోని ప్రజలు "తమ మోకాళ్లను వంచారు" లేదా "తాము సాగిలపడ్డారు." అక్కడ వారికి "ఎత్తయిన అను భవాలు" లేవు! యేసు మరణమగునంతగా వేదనపడ్డాడు, ఆయన మరింత ఆతురతగా ప్రార్థన చేయగా ఆయన చెమట, నేల పడుచున్న గొప్ప రక్త బిందువులవలె ఆయెను. అక్కడ ఆయనకు "శిఖరాగ్రపు అనుభవమేమీ" లేదు. ప్రార్థన, "మంచిగా ఫీలవ్వడం" అనే రెండు మిళితం కావు! ప్రార్థన త్యాగమైయుంది ... ప్రార్థన బాధలో ముగియవచ్చు.

"మత సంబంధంగా ఉన్నతులైనట్టు" ఫీలయ్యేలా ప్రార్థన మనలను చేయకూడదు. "నేను దాన్నిగూర్చి ప్రార్థించాను" అంటూ కేవలం యితరులను అణగద్రొక్కి పైకి భక్తిగలవారిలా కన్పించే యాజకులుంటారు. అంటే, వారితో ఏకీభవించనివారు దేవునికి విరోధంగా పోరాడుతున్నట్టేనని దాని భావం. ఎక్కువ భక్తిగలవారంటే నాకు భయం. "నీ కంటె నేను ఎక్కువ ఆత్మ సంబంధమైన అంతస్థులో ఉన్నా, నేను దాని గూర్చి ప్రార్థిస్తాను" అనేవారు తమ్మును తాము పొగడుకుంటున్నారు. ప్రార్థనను గూర్చి అతిశయించడం, అణకువను గూర్చి గర్వించినట్టుంటుంది. తమ ప్రార్థనల వెనుక దాగియున్న ప్రజలను వేషధారులని ప్రభువు అన్నాడు (మత్తయి 6:1–18). ప్రార్థన వినయునిగా చేస్తుంది. నీవు ఎంత ఎక్కువగా ప్రార్థిస్తావో అంత ఎక్కువగా ప్రార్థించ ఎరుగుతావు.

ప్రార్థనను మోసపుచ్చుటకు ఉపయోగించుకునే అవకాశం ఉంది. టి. వీ. ప్రసంగీకులు రోజూ ఈ పని చేస్తారు! వారు నీ డబ్బు కొరకు అడుగుతారు, తరువాత ప్రార్థనతో నిన్ను అవమానం చేస్తారు. నేను ఏ స్థానిక సంఘాన్నైనా ఎప్పుడైనా అడిగింది నా కొరకు ప్రార్థన చేయమని మాత్రమే. జాగ్రత్త! ప్రోగ్రాములను అమ్ముకొనడానికి, తమ యిష్టాన్ని నెరవేర్చుకొనడానికి, సంఘ నాయకులు ప్రార్థన అనేదాని వెనుక దాగే అవకాశం ఉంది. "దానిని గూర్చి ప్రార్థించండి" అనేది బైబిలు అధికారానికి లేక ఆలోచనకు బదులుగా నుంచబడినది కాదు. "నీ కంటె ఎక్కువ–పరిశుద్ధుడను" అనే తత్వాన్ని కనుపరచే ప్రజల విషయమై జాగ్రత్త. ప్రార్థనల ద్వారా సంఘాలను కంట్రోల్ చేసే సహోదరులను గూర్చి జాగ్రత్త. బైబిలు సంబంధమైన ప్రార్థన యిటు దేవునిగాని, అటు మనిషినిగాని నేర్పరులనుగా చేయనేరదు. అభిసంధానం అనేది ఎల్లప్పుడు తప్పే – ప్రత్యేకించి ప్రార్థన వెనుక దాగి ఉన్నప్పుడు. "సహోదరుడు హడ్గే, నేను నీ కొరకు ప్రార్థిస్తాను" అనే ఒక సహోదరి మాట భయము కలిగించేదై ఉండవచ్చు.

ప్రార్థించు ... దేవునికి ప్రార్థించు.

# ప్రార్థనలలో సమస్యలు

## (మత్తయి 20:20-28)

"అందుకు యేసు - మీరేమి అడుగుచున్నారో మీకు తెలియదు ... అని అన్నాడు "(మత్తయి 20:22ఏ).

మన ప్రార్థనలు యితరులను బాధిస్తాయా? మన ప్రార్థనలు సమస్యలను లేక చెడు విషయాలను మరింత జటిలంగా మారుస్తాయా? దాన్ని మనం ఎదుర్కొందాం! అడిగినట్టు అనేక ప్రార్థనలు బదులు పొందవు! సహోదరుడు జోన్సుగారి పొలం ఎందుకు ప్రత్తిని పండించడం లేదు? ప్రజలు ఎండ కొరకు ప్రార్థించారు - కాని వానపడింది. సహోదరులు బ్రతుకుటకు ప్రార్థించారు, కాని చనిపోయారు. యేసును, పౌలును ప్రత్యేకమైన వాటి కొరకు ప్రార్థించారు కాని నిరాకరించబడింది. ఇంకా ఆలోచించు. అడిగినది నీవు పొందనప్పుడు యింకా ప్రార్థించడం ఎందుకు? ప్రార్థనకు ఫలితంగా ఆశీర్వాదాలు కావాలని కోరే స్వార్థపరులు అడిగే ప్రశ్న అది! యితరులు - వారు దీనమనస్సు గలవారంటూ తమకు సంబంధించిన దీవెనల కొరకు అడగడానికి మోమాటపడతారు. ఇది ప్రార్థనలో ఉండే విరోధ భావం, ప్రార్థనయందు లోతైన మర్మం.

మనం ఏమి నేర్చుకున్నాం? శక్తి దేవునియందేగాని ప్రార్థనయందు లేదు! దేవుడు ప్రార్థన వినే, ప్రార్థనకు బదులిచ్చే దేవుడు. దేవుడు విని, పని చేస్తాడు గనుక ప్రార్థన శక్తిగలదైయుంది. ఒక వృద్ధుడును జ్ఞానియునైన ఒక స్నేహితుడు యిలా అన్నాడు: "నీవు దేవుని వెదకినప్పుడు, నీవు గైడెన్సును (మార్గదర్శిని) పొందతావు; దేవుడు లేకుండ గైడెన్సును నీవు వెదకినప్పుడు, నీవు ఏమియు పొందలేవు." ప్రార్థన దేవుని మార్చుతుందని ఆలోచించడం - దేవుని గూర్చియు, నరుని గూర్చియు, ప్రార్థనను గూర్చియు అయోగ్యమైన తలంపులు కలుగుతాయి. దేవునికంటె నరుని మనస్సు అధికమైనది కాదు! పరలోక సంబంధమైన తీర్మానంలో చిక్కుకొనడం మనస్సును వేధించునది, హీనపరచునది, భయంకరమైనదియునైయుంది! దీనిని మనం గ్రహించుదాం! లోతైన దైవశాస్త్రం, తర్కశాస్త్రం, దైనిక జీవితానికి సంబంధించిన సమస్యలు ప్రార్థనను ఆవరించియుంటాయి. ప్రార్థనను అర్థం చేసికొనడం దేవుని గ్రహించడమౌతుంది. ప్రార్థన ఎంత సరళంగా ఉన్నా, ప్రార్థనకు సంబంధించింది ఏది సింపుల్ కాదు!

దేవుని సన్నిధికి ప్రవేశించడానికి సమయం కావాలి! బైబిలును స్టడీ చేయడానికి సమయం తీసికొంటుంది; పరిశుద్ధంగా ఉండడానికి సమయం అవసరం; ప్రార్థించ డానికి సమయం వెచ్చించాలి. ప్రార్థన కేవలం వినయం గలవారికి, నిస్సహాయులకు మాత్రమే. ప్రార్థనలో మనం యెహోవా దేవునితో, మహా విశ్వం యొక్క సృష్టికర్తతో

మాట్లాడుతున్నాం. ఒక రాజుతో, ప్రసిద్ధ పురుషునితో, మహా వీరునితో మనం ఏమి చెప్పుతాం? నేను మాట్లాడుతాను, దేవుడు ఆలకిస్తాడు! సర్వశక్తిగల దేవునితో ఒకడు ఏమి చెప్పగలడు! అలాటి జ్ఞానం నాకు అందనిది. ఆశ్చర్యం! దేవుడు దీనికి అనుమతించడం మాత్రమే కాదు, ఆయన దీనిని ఆజ్ఞాపిస్తాడు!

## ఎలా ప్రార్థించాలో మనిషికి తెలియదు

మనం ఎలా ప్రార్థించవలెనో మనకు తెలియదు. ఇది నాకు ఎలా తెలుసు? బైబిలు అలా చెప్పుతోంది: "... మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదు" (రోమా 8:26). మత్తయి 20:20–28ని జాగ్రత్తగా చదువు. యాకోబు, యోహానులకు "కోర్కెలకు సంబంధించి తప్పు ఆలోచన" ఉంది. వారు పన్నాగం పన్నారు; వారు రహస్యంగా సమ్మతించారు. వారు ఏమి సంకల్పించారో అది వారి తల్లి చెవిలో ఊదారు! అది అవివేకమయ్యింది; సిద్ధాంత పూర్వకంగా అసాధ్యమయ్యింది; అది తప్పు; అది యితరులను బాధించగలదు!

మనుష్యులు "తమ్మును తామే బుద్ధిహీనులుగా" చేసికొంటారు; ఇది జీవితంలో ఒక సత్యమైయుంది – రాజకీయాలు, పెద్ద వ్యాపారాలు, సంఘపు కార్యాలను సహా చర్చించడంలో వారు యిలా చేస్తారు. మనం ఎప్పుడు నేర్చుకుంటాం? నరుడు చాల తక్కువ ఎరిగియుంటాడు – "ఎడిటర్స్ ఉత్తరాలు" న్యూస్ పేపర్‌లోని కార్టూన్స్ కంటె ఎక్కువ వినోదంగా ఉంటాయి. నరుడు ఎరుగడు, ఎరుగలేడు. కష్టమైన మార్గంలో యోబు నేర్చుకోవలసి వచ్చింది. దేవునితో అతడు వాదాడగలడని తలంచాడు! అతడు తన నోటిని వాదనలతో నింపుకున్నాడు. అప్పుడు దేవుడు వచ్చాడు! దేవుడు ప్రశ్నించాడు. జీవితాన్ని గూర్చిన ప్రాథమిక ప్రశ్నలలో ఒకదానికి కూడా అతడు దేవునికి బదులు చెప్పలేకపోయాడు (యోబు 40:3–5; 42:1–6). యోబు తన పాఠాలను బాగా నేర్చుకున్నాడు. దేవుడు దేవుడును, నరుడు నరుడునైయున్నాడు.

ఏదిలేకపోయినా, దేవుడు నరుని తన పనిలోనికి ఆహ్వానిస్తున్నాడు. పరలోకం నిత్య ప్రశ్న ప్రదర్శనగాను, దేవుడు ప్రశ్నలకు జవాబు చెప్పేవానిగాను అనేకులు ఆలోచిస్తారు. దానిమీద ఆధారపడకు! "నేను ఆయనను కలిసికొనేవరకు – దేవునిని వెయ్యి ప్రశ్నలు అడగాలనుకున్నాను" అని ఒకడు అన్నాడు. దేవుని కనుగొనగా, దేవుడు ఏమి కోరుతున్నాడో అది మన కోరికలకంటె ఎక్కువ ముఖ్యమైనవని తెలిసికొంటాం. తెలివితక్కువ విన్నపాలకు ప్రార్థనను కుదించకూడదని యాకోబు యోహానులు నేర్చుకోవలసి వచ్చింది. కుటుంబ స్వప్రయోజనాల కొరకు ప్రార్థనను ఉపయోగించుకోకూడదు. పరిశుద్ధులు సహితం దేవుని తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకో చూడకూడదు. దేవుడు మన ప్రార్థనలు ఆలకించి జవాబులు చెప్పగోరతాడు. ప్రార్థనలో దేవుని ఎరగాలి గాని ఉపయోగించుకో కూడదు! దేవుని కలిగియుండకుండ దేవుని శక్తికి ప్రవేశం మనకుండ కూడదు. ఇదీ విషయం.

కొన్ని ప్రార్థనలు ఎందుకు జవాబులు పొందుతున్నాయో, కొన్ని ఎందుకు

కాదనబడుతున్నాయో ఎరగడానికి, (సర్వమెరిగిన) దేవుని మనస్సు కావాలి. రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును (ద్వితీయో. 29:29). ఆకాశములు భూమికంటె యింకను ఎంతో ఎత్తుగానున్నవి. దేవుడు సృష్టికర్త; మనము సృజింపబడిన వారం. ప్రార్థనను సంపూర్ణంగా ఎరగడం దేవుడైయుండడమే. అంతేగాక, నరునికి సర్వం తెలిసియుంటే, యింకా ప్రార్థించడం దేనికి? మనం దేవునియందు విశ్వాసముంచు తున్నామా? మనం దేవునియందు విశ్వాసముంచినట్టయితే, ప్రార్థించి, నెమ్మదిగా వేచియుంటాం. నరునికి దేవుడు అవసరం ... వివరణలు కాదు. నరుని "అల్పమైన" మనస్సు వివరణను చేపట్టలేదు. దేవుడు యోబునకు దేనిని వివరించలేదు – అయితే ఆయన వచ్చాడు! యోబుకు జవాబులు కాదు, దేవుడు కావాలి. మనకు దేవుడు కావాలి. దేవుడు దేవుడైయున్నందున, దేవుడు ప్రార్థనలకు ఎలా, ఎందుకు జవాబులిస్తాడో తెలిసికొనడం నిజంగా మన పనియైయుంటుందా? మన ఆలోచన లేకుండ దేవుడు మనలను నడిపించడు, కాని మన ఆలోచన ద్వారా నడిపిస్తాడు. "నీవు టేపులను వినవచ్చు, పుస్తకాలను చదవవచ్చు, ప్రార్థనా సెమినార్లకు హాజరవ్వవచ్చు; కాని మనం ప్రార్థన చేయనారంభించినప్పుడే మనం ప్రార్థించ నేర్చుకుంటాం" అని ఎవరో ఒకరన్నారు. ప్రార్థనకు వెలుపల మనకు మనమే వేదాంతంలోనికి దిగనవసరంలేదు. ప్రార్థించు ... ప్రార్థించు ... ప్రార్థించు, లేఖనముల మీద ఆధారపడి ప్రార్థించు, దేవుడు నీ ప్రార్థనలకు జవాబిచ్చాడని నీవు ఒప్పింపబడ్డావు.

## తానేమి అడుగుతున్నాడో మామూలుగా మనిషి ఎరుగడు

మనం కొంచెంగా గురిపెట్ట చూచి ఎంతో పోగొట్టుకుంటాం! యాకోబు యోహానులను యేసు గద్దించాడు. ఏదియెలాగున్నా, మత్తయి 20:20–28ని మొదటిసారిగా చదువుతున్నట్టు చదువు. తల్లి కుమారులు ప్రభువైన యేసునొద్దకు వచ్చి ఆయనకు నమస్కారం చేయడం జరిగింది. మనుష్యుడు, తన అతి శ్రేష్ఠతలలో తప్పిపోతాడు! ఎవడును పరిపూర్ణుడు కాడు. వారు అడిగారు. దానికి యేసు యొక్క ప్రత్యుత్తరంను గమనించు: "నీవేమి కోరుచున్నావు?" అని ఆయన అడిగాడు (మత్తయి 20:21). ఆయనను అడగాలని యేసు కోరుచున్నాడు, ఆయన మనకు యివ్వగోరు తున్నాడు. యేసు వద్దకు రావడం తప్పు కాదు; అతనిని గురించి అడగడం తప్పు కాదు.

యేసు గద్దింపు కఠినంగా ఉంది: "– మీరేమి అడుగుచున్నారో అది మీకు తెలియదు" అని ఆయన అన్నాడు (22ఎ వ.). వారి మనవిని రెండు ప్రాథమిక కారణాలనుబట్టి ప్రభువు నిరాకరించాడు: (1) వారి మనవి తనకును, యితరులకును హాని కలిగిస్తుంది, మరియు (2) అది సిద్ధాంతపరంగా అసాధ్యమైనది. దేవుడు యేసునకు సిలువ యిచ్చాడు – సింహాసనం కాదు. తక్కిన శిష్యులు – యాకోబు యోహానులమీద మండిపడ్డారు! వారి కోర్కెలకు "అవును" అనే జవాబు "సంఘాన్ని చీల్చివేసేదే." కాదన్నప్పుడే పలుమార్లు మన ప్రార్థనకు సరియైన బదులు వచ్చియుంటుంది. వారి సంఘటన ఆలాటిది. "జవాబు రాని ప్రార్థనకంటె జవాబు వచ్చిన ప్రార్థనకు ఎక్కువ

కన్నీళ్లు కార్చబడ్డాయి" అని ఒక వ్యక్తి అన్నాడు. "లేదు" అని బదులివ్వబడిన ప్రార్థనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుటకు చాలినంత దీర్ఘకాలం నేను బ్రదికాను. స్వార్థపరమైన, ఆలోచింపకుండ చేసే ప్రార్థనలు మనకు హాని చేస్తాయి. అట్టి ప్రార్థనలు చాల ఎక్కువ చక్కెర పదార్థం కావాలని కోరే పసిపిల్లలవలె మనలను చేస్తాయి.

లేఖన భాగాన్ని ముందుకు చదువు. ఆ కుమారులకు త్యాగమే గాని మహిమ ముందు పెట్టబడలేదు. విజయవంతమైన ప్రార్థన దేవునినుండి మనం ఏమి పొందాము అనేది కాదు, కాని దేవుడు మనవద్దనుండి ఏమి పొందుతాడు అనేదే. ఈ గమనిక మన ప్రార్థనా జీవితాల్లో ప్రాముఖ్యమైనది. మనం మంచిగా ఫీలయ్యేలా చేయడానికి మనం దేవునికి చేసే ప్రార్థన చిత్రించబడలేదు – అది మనలను వినయము గలవారిగా చేయ చిత్రింపబడింది. ప్రార్థన – పని చేయడానికి, ఆలోచించడానికి, కనిపెట్టడానికి, శ్రమపొందడానికి, లేక కానుకలు యివ్వడానికి బదులుగా ఎన్నడే ఉద్దేశింపబడలేదు. ఈ ప్రయాసలన్నిటికి ప్రార్థన పునాదియైయుంది. ప్రార్థనలో మనలో ఉన్న శ్రేష్ఠమైనదానిని దేవుడు బయటికి రాజేస్తాడు!

యాకోబు, యోహానులకు ప్రభువు "ఉరుమువారు" అని పేరు పెట్టాడు (మార్కు 3:17). వారు ఎరుగబడిన విధానాన్ని కాలము, ఎదుగుదల మార్చింది. హతసాక్షియైన అపొస్తులులలో మొదటివాడు యాకోబు. యోహాను "ప్రేమయొక్క ప్రియుడగు అపొస్తలుడుగా" రూపొందాడు. మనం ఒకప్పుడు ఏమి కాగోరామో యథార్థంగా వెనుకకు తిరిగి చూస్తే భయం కలుగవచ్చు. ఒకప్పుడు మనం కోరింది యిప్పుడు అయిష్టంగా ఉండవచ్చు. ప్రార్థన మనలను మార్చుతుంది ఎందుకంటే ప్రార్థన మనలను పెంచుతుంది.

## మనం అడుగకముందే దేవునికి తెలుసు

ప్రార్థనయందు నమ్మకం ఉంచడానికి, ఒకడు లోతుగాను యథార్థంగాను ఆలోచించాలి. మనం అడుగకముందే దేవునికి తెలుసు. అప్పుడు "ప్రార్థించేది ఎందుకు?" అని సందేహవాదులు అడుగుతారు. ప్రార్థన కొరకు ఉన్న కారణమంతా కేవలం యిదే: "... మీరు అడుగక ముందే మీ పరలోకపు తండ్రికి తెలియును" (మత్తయి 6:8, 32; లూకా 12:30). ప్రార్థన అనేది పిల్లలను తండ్రికి లోబరచుకొనడమైయున్నట్టు ప్రభువు సూచించాడు (మత్తయి 7:11; లూకా 11:13). తమ పిల్లలు గాఢంగా, మాటిమాటికి అడగకుండ కొన్ని బహుమానాలు తల్లిదండ్రులు పిల్లలకు యివ్వరు.

"అడుగుడి," "వెదకుడి," "తట్టుడి" అని యేసు చెప్పిన సంగతిని గుర్తుంచుకో, ప్రార్థన అనుకోకుండ జరిగే మత సంబంధమైన గారడీ కాదు. ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు బహు ఎక్కువగా అతి త్వరలోనే యిస్తారు. వారు పెద్దవారైన తరువాత నిజ జీవితానికి వారు సరిగా సిద్ధపడినవారు కాకపోతారు. దేవుడు "శాంతా" క్లాజు కాడు. బాధ్యతారహితమైన కోర్కెలు యివ్వబడడం అపాయకరం. ప్రార్థనలో పలుమార్లు విడువక గాఢంగా అడగడం ఉంటుంది ... అది అవివేకం కాదు. పిల్లవాడు అడిగింది ప్రతిదీ యివ్వడం ఆసక్తిని కలిగించకపోవచ్చు. మనం దేని విషయంలో పని

చేయనిష్టపడ్డామో దాన్ని పొంద ప్రార్థించ కూడదు. నేడు అనేకులు త్యాగం లేకుండ కానుకలు యిస్తూ ఉంటారు, ఉపవాసం లేకుండ ప్రార్థిస్తూ ఉంటారు, కన్నీళ్లు లేకుండ సువార్త ప్రకటిస్తూం టారు. అది పని చేయదు! ప్రార్థన తరువాత మనం ఏమి చేస్తామనేది మన ప్రార్థనకు వెల కట్టుతుంది. ప్రార్థన క్రమశిక్షణయైయుంది.

దేవుడు ఒకే మార్గంలో పని చేస్తాడని తలంచడం విషాదకరం. పరిస్థితులు మెరుగుపడక ముందు అవి మరి దారుణంగా ఉంటాయని బైబిలు మనకు తెలుపుతుంది. ఇది సిలువ యొక్క సత్యం. సిలువ లేకుంటే – కిరీటం లేదు. మనం ఎదురు చూచేదానికి దేవుడు వ్యతిరేకమయ్యింది కూడా చేయవచ్చు. ఎదురు చూడని దానిని దేవుని యొద్దనుండి పొంద సిద్ధపడడమనేది విశ్వాసం యొక్క ప్రాథమిక సూత్రమైయుంది. చీకటియందు దేవునిపై నమ్మిక యుంచవచ్చా? తెరువబడిన కాళీ హస్తాలు ఎక్కడ ఆయన కనుగొంటాడో అక్కడ మాత్రమే ఆయన యిస్తాడు. అనుదిన జీవితంకంటె నిత్యజీవం కొరకు దేవునియందు విశ్వాసముంచడం సులభంగా ఉంటుంది.

ఇతరులు, తప్పుడు వినయంతో, “దేవుని తొందరపెట్టరు.” వెళ్లి ఆయనను తొందరపెట్టు! తల్లిదండ్రులు తమ పిల్లలచే తొందరపెట్టబడగోరతారు! తమ పిల్లలు ఎదిగి పెద్దవారవడాన్ని చూచి తల్లిదండ్రులు ఆనందిస్తారు. దేవునికి అతి చిన్నది ఏదీలేదు – అతి పెద్దదీ ఏదీలేదు. ప్రార్థనకు ఏదీ చిన్నదిగా కన్పించినా, అది వేదనపడే భారంగా ఉండవచ్చు. దేవునికి ఏదైనా అతి పెద్దది అనుకుంటే, అది విశ్వాసపు లోపమే అయ్యుంటుంది.

> ప్రార్థించడానికి భయపడకు; ప్రార్థించడం సరియైనది;
> నీవు చేయగలిగితే నిరీక్షణతో ప్రార్థించు, అయితే ఎప్పుడూ ప్రార్థించు.
> నిరీక్ష బలహీనమైనా లేక దీర్ఘ ఆలస్యంవలన వ్యాధి వచ్చినా.
> వెలుగు లేకున్నట్టయితే, చీకటిలో ప్రార్థించు;
> మరియు నీవు ఏ కోర్కె విషయములోనైనా ప్రార్థింపజాలకుంటే,
> ఆ కోర్కెను తీసిపారవేయుమని దేవునికి ప్రార్థించు.

## నరుడు దేవుని మార్చగలడా?

నరమాత్రుడు సర్వశక్తుడగు దేవుని మార్చగలడా? ఎంతటి పవిత్రమైన భక్తిపూర్వకమైన ఆధిక్యత అది! మేలైన జవాబులు నావద్ద ఉంటే బాగుండనని అనుకుంటా! క్షణికుడు, దోషి, లోపముగల నరుడు తప్పులేని దేవుని మార్చగలడా? ఈ ఆలోచన అసంభవమా? నిర్గమ. 32:14లో మోషే చేశాడు. 2 రాజులు 20:1–6లో హిజ్కియా చేశాడు! ఇతరులు ప్రార్థించి మహా ఘనమైన జవాబులు పొందారు! దేవుని యొక్క అణకువ! దేవుని యొక్క రిస్కు! ఆహా ఎలాటి దేవుడు! మన లేఖన భాగంలోని యాకోబు యోహానులు పొందలేక పోయారు. దేవునికి నరుడు ఒక ఆలోచనను సూచించడం అనేది నమ్మశక్యం కానిది. అయినా, ప్రార్థన మూఢ నమ్మకం కాదు. దేవుడు గారడీవాడో లేక ఇన్స్యూరెన్స్ కంపెనీయో కాదు. జ్ఞానంగల తల్లిదండ్రులు తమ పిల్లల మనవుల కొరకు ఎదురు చూస్తారు. జ్ఞానమైన విన్నపాలను వారు గౌరవిస్తారు, అయితే తప్పులను మభ్యపెట్ట జూచేవాటిని వారు

కాదంటారు. దేవుడు మోసాలను, విగ్రహాలను, తెలివితక్కువ వాగ్దానాలను అసహ్యించు కొంటాడు. బొమ్మల పూజనో, పూసలను లెక్కించడాన్నో దేవుడు పట్టించుకోడు.

ప్రార్థన వాగ్వాదం కాదు, దేవుని చిత్తానికి వ్యతిరేకంగా మానవుడు దేవునికి ప్రార్థించలేడు. దేవుడు వెనుకాముందు ఆడేవాడుకాదు – ఆయన యిష్టపడతాడు." మాట్లాడి దేవుని క్రిందికి దించడం" కాదు, గాని "మనలను మనం పైకి లేపుకోవాలి." ప్రార్థన అంటే దేవుడు మనలను ఉపయోగించుకొనడం కాని – మనం ఆయనను ఉపయోగించు కొనడం కాదు. "దేవుని శోధించడం" అనేది – నెమ్మదియైన, ఉద్దేశపూర్వకం కాని దేవదూషణయైయుంది. స్నేహాన్ని "ఉపయోగించుకొనడం" అంటే, స్నేహాన్ని "దుర్వినియోగం" చేయడమే.

## ఇతరుల విషయం ఆలోచించాలి

మిగిలిన అపొస్తలులు, యాకోబు యోహానుల మీద మండిపడ్డారు – ఆ మనవి వారు ముందుగా చేయాలని ఆలోచింపనందుకు చిరబురలాడేరనే భావం కావచ్చు. ఒకడు వర్షం కొరకు ప్రార్థిస్తాడు; మరొకడు ఎండకొరకు ప్రార్థిస్తాడు. ప్రార్థనలు ఒకదానినొకటి కొట్టివేయవచ్చు. నీతిమంతులమీదను అనీతిమంతులమీదను దేవుడు తన వర్షాన్ని కురిపిస్తాడు; దేవుడు తనకు తానే ఖండించుకోలేడు. 500 కోట్ల మంది ప్రజలు భూమిమీద ఉన్నా, దేవుని చేతులు నిండుగానే ఉన్నాయి.

అవును, దీనిని గుర్తించు! అనేక ప్రార్థనలు బాల్య దశకు చెందినవై. అవి స్వార్థపరమైనవి, తప్పైనవి! మన లేఖన భాగం ఆ విషయాన్ని బయలుపరచు తోంది. యాకోబు యోహానులను మొదట కోపంలోను, తరువాత కనికరంతోను, అటు తరువాత నవ్వులాటతోను మనం చూస్తాం. వారు కేవలం మనలాటివారే! మన ప్రార్థనలను గూర్చి నీవేమనుకుంటావ్?

"ప్రభువా, నేను ప్రార్థనయందు నమ్మికయుంచను.
నేను నీయందు విశ్వాసముంచుచున్నాను.
విశ్వాసంతో ప్రార్థన చేయ నాకు నేర్పించండి."